క్లుప్తంగా

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు

మన్సూరాబాద్: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్ , కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు అన్నారు.మన్సూరాబాద్ సూర్యోదయ కాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల కళాశాలను మంగళవారం వారు సందర్శించారు.మనలోని మనిషి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్ , కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 12 వారాల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆకడమిక్ హెడ్ శ్రీనివాసులు, ఆర్‌ఎల్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ వినీల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మన్సూరాబాద్: భాష్యం పాఠశాల ఫ్రెషర్ డే వేడుకలు చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాష్యం విద్యా సంస్థల జెడ్ఈఓ అంకమరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఎన్నికల ప్రక్రియ తెలుసుంటే అర్హులైన వారికి ఓటు వేసే జ్ఞానం పెరుగుతుందని, అటువంటి పరిజ్ఞానం వల్ల సమాజం చైతన్యవంతమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, భాష్యం లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ హేమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తపేటలోని సమస్యలు పరిష్కరించాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని, ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ ప్రధాన రోడ్డు పనులు ప్రారంభించాలని వినతి పత్రంలో కోరారు. కొత్తపేట డివిజన్ లో బోనాల వేడుకలు ప్రారంభమవుతున్నాయని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని, ఆలయాల దగ్గర వీధి దీపాలు బిగించడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో అర్ధంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీవాసులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అలా చేసినప్పుడే పనులు త్వరగా పూర్తి కావడమే కాకుండా పనులలో నాణ్యత మెరుగుపడుతుంద న్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 67, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 95, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 45, దొండ 28, ఆలు 21, ఉల్లి 22, గోకర 28, దోస 23, సార 15.

సందడిగా గోరింటాకు ఉత్సవం



పాల్గొన్న మహిళలు

ఆషాఢ మాసం సందర్భంగా కుర్మగూడ డివిజన్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక మహిళలు ఒకరికొకరు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేశారు. కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు దశరథ లక్ష్మి, డివిజన్ నాయకులు సత్యవతి, లలిత, సంతోష్, శివాణి పాల్గొన్నారు.

– చంచల్‌గూడ

కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడతారు: దేప



కొత్త మనోహర్‌రెడ్డి, పాండురంగారెడ్డిలను సన్మానిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మహేశ్వరం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి కొత్త మనోహర్ రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి మంగళవారం దేప భాస్కర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని దేప భాస్కర్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాబోయే రోజుల్లో అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుళ్ల శివ ప్రసాద్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి



కమలానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: కమలానగర్ పరిసర కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా కమలానగర్, పరిసర కాలనీలలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు తెలిపిన పలు సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

23న కొత్తపేట గ్రామ బోనాలు



సమావేశంలో పాల్గొన్న కొత్తపేట గ్రామపెద్దలు

నాగోలు: కొత్తపేట గ్రామంలో ఈనెల 23న బోనాల ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, మహంకాళి ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం సమావేశమైన వారు గ్రామంలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు బోనాల ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 20న గౌడ కులస్తుల కాటమయ్య బోనాలు, 23న కొత్తపేట గ్రామ బోనాల ఉత్సవాలు, 24న ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు జోగుపర్తి వెంకటేష్ గుప్తా, బూర్గుల రామేశ్వర్ గౌడ్, తాళ్ల శ్రీశైలం గౌడ్, తోట శ్రీనివాస్ యాదవ్, శశి పటేల్, కొమ్ము బాబు, బొడ్డుపల్లి కృష్ణ, ఎస్.సంజయ్, మహంకాళి ఆలయం ప్రధాన కార్యదర్శి లింగాల నరేందర్ గౌడ్, కోశాధికారి కాటా అశోక్ గౌడ్, కార్యవర్గ సభ్యులు లింగాల నర్సింగ్ గౌడ్ పాల్గొన్నారు.

బోనాల పేరుతో బలవంతపు వసూళ్లు: ఇద్దరి అరెస్టు



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

హస్తినాపురం: బోనాల ఉత్సవాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన టి.వెంకటేశ్ (25), హరి(24) కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జడ్జెస్ కాలనీలో పోచమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా అమ్మవారి వివాహం జరిపించి అన్నదానం చేయడానికి ప్రతి ఇంటికీ వెయ్యి రూపాయలు ఇవ్వాలని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని కాలనీవాసి టి.శ్రీనివాస్ మంగళవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆలయ నిర్వాహకులకు బోనాల చెక్కుల పంపిణీ



నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: బోనాల పండుగకు అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గుళ్లకు దేవాదాయ శాఖ విడుదల చేసిన బోనాల పండుగ చెక్కులను మంగళవారం ఆమె నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రాదాయాలకు బోనాలు ప్రతీక అని, ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. మొదటి దశలో 15 గుళ్లకు రూ. 4 లక్షలు మంజూరయ్యాయని, మిగిలిన వాటికి తొందరలోనే చెక్కులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి కుముద్దా, గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు వినయ్, శ్రీకాంత్, యాదగిరి, రాంచందర్ ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం

● దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

చాదర్‌ఘాట్: మూడెకరాల రైతులకు మూడు పూటల కరెంట్ చాలని సన్న, చిన్నకారు రైతులపై రేవంత్‌రెడ్డి విద్వేషం చిమ్ముతూ వ్యాఖ్యానించారని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అమెరికా పర్యటనలో ఎన్‌ఆర్‌ఐల సమావేశంలో రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలు కాంగ్రెస్ పార్టీ విధాన నిర్ణయాలుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. మొన్న ధరణి ఎత్తివేత ప్రకటన, అంతకు ముందు రైతు బీమా రద్దు, నిన్న ఉచిత కరెంట్, రేపు సంక్షేమ పథకాల రద్దు... ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణను సర్వనాశనం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం తప్పక గుణపాఠం చెప్తుందని వాసుదేవరెడ్డి అన్నారు.

లారీల అడ్డా తొలగింపులో ఎమ్మెల్యే విఫలం: సామ



ద్వారకామయినగర్‌లో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి

వనస్థలిపురం: పలు కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా తొలగింపులో ఎమ్మెల్యే, అధికారులు విఫలమయ్యారని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కాలనీవాసులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇసుక లారీల అడ్డా వల్ల చుట్టుపక్కల ఉన్న 18 కాలనీల ప్రజలు ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో లారీ అడ్డాను తొలగిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే ఆ తర్వాత ఆ ఊసే మరచిపోయారని రంగారెడ్డి విమర్శించారు. ఎల్‌బీనగర్ ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే తదనంతరం మాట నిలుపుకోలేన్నారు. బీజేపీని గెలిపిస్తే ఆటోనగర్ లారీల అడ్డాను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, ఎల్లప్ప, సామ ప్రభాకర్‌రెడ్డి, చంద్రపాల్ రెడ్డి, పార్వతి, రవీంద్రవర్మ, సాయికృష్ణ, నూతన్ ప్రసాద్, గోవిందచారి, వీడీ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

◆ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు... పద్మావతి కాలేజ్, లక్ష్మీనగర్, వినయ్‌నగర్, రిలయెన్స్ ఫ్రెష్, భారత్ గార్డెన్, విజయ డయాగ్నస్టిక్ సెంటర్, సంగం లక్ష్మీబాయ్ జూనియర్ కాలేజ్ పరిసర ప్రాంతాలు.

◆ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...ఎల్‌ఐసీ కాలనీ, ఓల్డ్ సైదాబాద్ పీఎస్, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలు.

◆ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు... సవేరా టిఫిన్ సెంటర్, ఆర్‌ఎస్ బ్రదర్స్, దిల్‌సుఖ్‌నగర్ ఆంధ్రా బ్యాంక్, రాజీవ్ చౌక్, చాయ్‌ఘర్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాలు.

విశ్వ నగరమంటే ఇదేనా?: రాంరెడ్డి



బండ్లగూడ చౌరస్తాలో పొంగుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డి

నాగోలు: బండ్లగూడ ఆనందర్‌నగర్ మోహన్ రోడ్‌లో కొన్ని నెలలుగా మురుగు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజులారెడ్డి ఆధ్వర్యంలో రాంరెడ్డి నాగోల్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చాలా కాలనీలలో వీధి దీపాలు లేవని, తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు ఉన్నట్లు వారు రాంరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని నెలలుగా బండ్లగూడ ఆనంద్‌నగర్ మెయిన్ రోడ్‌లో మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతోఆ ప్రాంతంలో దుర్గంధం వ్యాపిస్తోందని తెలిపారు. మురుగునీరు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకోవాలని చాలాసార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, విశ్వనగరం అంటే ఇదేనా... హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దామని చెప్తున్న బీఆర్‌ఎస్ పాలకులకు ప్రజల ఇబ్బందులు పట్టవా అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధీర్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గాంధీ నాయక్, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు కిషోర్ గౌడ్, గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షుడు వేణు యాదవ్, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నేత జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రద్ధాబాద్ మార్కెట్ బోనాలు



శ్రద్ధాబాద్ మహంకాళి జాతర బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సుభాష్‌చందర్జీ

సైదాబాద్: బోనాల మహోత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని నగర మాజీ డిప్యూటీ మేయర్, శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ చైర్మన్ సుభాష్‌చందర్జీ అన్నారు. మంగళవారం సైదాబాద్‌లో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 45వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవం బ్రోచర్లను ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జాతర వివరాలు వెల్లడించారు. శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16న అమ్మవారికి బోనాల ఉత్సవం, 17న అమ్మవారి ఘటాల ఊరేగింపు, 18న సైదాబాద్ మార్కెట్‌లో అన్నదానం నిర్వహిస్తామన్నారు. పోతురాజులు, పౌరాణిక, దేశభక్తుల వేషధారులు, భక్తి భజన పాటలతో, చిన్నారులు యువత ఆటపాటలతో ఘటాల ఊరేగింపు వైభవోపేతంగా సాగుతుందన్నారు.అనంతరం ధోబీఘాట్ వద్ద ఘటాల నిమజ్జనంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం

శ్రద్ధాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడిగా మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సహదేవ్‌యాదవ్, సంగోధి పరమేశ్‌కుమార్, గౌలీకర్ దినేష్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌చందర్జీ, కోశాధికారిగా గౌలీకర్ పూర్ణచందర్, కార్యదర్శులుగా కొల్ల గోపి, ఆశీష్ గౌలీకర్ నియమితులయ్యారు.

పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరం



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

ఎల్‌బీనగర్: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఒక వరమని, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఉప్పల మండలాలకు చెందిన 90 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల కష్టాలను తీర్చడానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ పథకాలు ఎంతో దోహద పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్, సరూర్‌నగర్ డీటీ అవినాష్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీల నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ, శ్రీనివాస పురం కాలనీ, నాగార్జున కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కోరారు. ఈ మేరకు ఆయన ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో జెడ్సీని మంగళవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. తమ వినతికి జెడ్సీ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మోహన్‌రెడ్డి, హరీందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లు పరిశీలించిన కార్పొరేటర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో బోనాల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, పాతూరి రాజేందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, రమేష్, లక్ష్మణ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తా..



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీల్లోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని, ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకురావాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు రవీందర్, సభ్యులు మధు, మనోహర్ పాల్గొన్నారు.

కాల్‌సెంటర్ కార్యాలయంపై దాడి: ఫర్నిచర్ ధ్వంసం



ధ్వంసమైన ఫర్నిచర్

చైతన్యపురి: కాల్ సెంటర్‌పై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందివి. పోలీసుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ లింగాల కాంప్లెక్స్‌లో పన్నెండేళ్లుగా వివేక్‌కుమార్ పాండే అనే వ్యక్తి కంపెనీ ఫ్యూచర్ సర్వీసెస్ పేరుతో నిరుద్యోగులకు బీపీఓలలో ఉద్యోగాలు కల్పిస్తున్నాడు. ఇదే కంప్లెక్స్ మూడో అంతస్తులో ఉండే ఇన్ఫినిటీ సొల్యూషన్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు మంగళవారం మధ్యాహ్నం సుమారు 25 మందితో కలిసి వివేక్‌కుమార్ పాండే కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. తమను వారించిన మహిళా ఉద్యోగులను దుర్భషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో వివేక్ కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వచ్చే ఎన్నికల్లో బీసీలకు 60 సీట్లు కేటాయించాలి

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక



సమావేశంలో పాల్గొన్న బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు

నాగోలు: వచ్చే శాసనసభ ఎన్నికలలో బీసీలకు 60 సీట్లు కేటాయించాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాగోలులో ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని బీసీలను ఒకే వేదిక పైకి తీసుకురావడానికి తాము ప్రణాళిక రూపొందించామన్నారు. ఈనెల 18న మన్సురాబాద్ చౌరస్తాలోని సకులశాలి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీలను తరగతులుగా విభజించి అణచివేతకు గురిచేసి వెనుకకు నెట్టేశారన్నారు. ఐక్య పోరాటం ద్వారానే సమస్యలు సాధించుకోవాలన్నారు. 52 శాతం బీసీలు ఉన్న రాష్ట్రంలో సామాజిక తెలంగాణ పేరిట బీసీలకు ఎటువంటి సహాయ సహకారాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతిరావు పూలే పేరుతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను పెంచాలని, కార్పొరేషన్ ద్వారా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రిని పార్టీలు ప్రకటించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ ముదిరాజ్, బాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుండ్ల ఆంజనేయగౌడ్, దావా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వడ్లగొని అంజయ్య గౌడ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365